330128601

# ప్రబోధ 36

పెక్కు విద్యలు నేర్చిన ఒక్కడైన
సరస సద్గుణవంతుడైన సాధు బుద్ధి
సత్య వర్తన ధర్మంబు శాంతి గుణము
గడుప నేర్చిన విద్యార్థి కలడె యిలలో
నేటి విద్యలు తెలివితేటలని యెంచు
కొంచెమైన గుణము పెంచబోదు
కోటి విద్యలుండి గుణము లేకున్నచో
వాటి విలువ యేటిపాలు కాదె.

దివ్యాత్మ స్వరూపులారా!

జీవ జగత్తుకు ప్రకృతియే భావసారము. ప్రకృతి సారమే నీరు. నీటి యొక్క ప్రయోజనమే సస్యము. సస్యము యొక్క సారమే పురుషుడు. పురుషుని యొక్క ప్రయోజనమే వాక్కు. వాక్కు యొక్క పటుత్వమే ఋక్కు. ఋక్కు యొక్క సౌందర్యమే సామము. సామము యొక్క సారమే ఓంకారము. ఓంకారము వినుపించునే గాని కనుపించదు. ఇది పరమాత్మునికి పర్యాయ పదమే. ఓంకారము లేని స్థానముగాని, ఓంకారము వినుపించని క్షణముగాని, ఓంకారము వ్యాపించని జీవకణముగాని జగత్తునందు లేదు. జగత్తంతయు ఓంకారమయమే. ఇట్టి ఓంకారమయమైన జగత్తునందు ఓం యిత్యేకాక్షరం బ్రహ్మ. ఏకాక్షరమైన ఓంకారమే బ్రహ్మస్వరూపమని యీ బ్రహ్మతత్త్వము సర్వవ్యాపకత్వముగా భావించుచూ అయమాత్మా బ్రహ్మ ఆత్మ కూడను బ్రహ్మమయమే అని, బ్రహ్మకూడను ఆత్మయే అని మాండూక్యము చాటుతూ వచ్చింది. ఏతావాతా ఓంకారము బ్రహ్మ, ఆత్మ యివి అభేద తత్త్వములు, అవినాభావ సంబంధములు, అన్యోన్య ఆశ్రయములు. అయితే యిట్టి ఆత్మను ప్రతి మానవుడు గుర్తించుటము అత్యవసరము. ఆత్మ యొక్క స్వరూపము ఏమిటి? ఆత్మ వున్న ప్రదేశము యేమిటి? దీని యొక్క చిహ్నము యేమిటి అనే విషయము ప్రతి మానవుడు అత్యవసరముగా గుర్తించాలి.

మానవుడు నిత్య జీవితములో నాలుగు అవస్థలు అనుభవిస్తున్నాడు జాగ్రత, స్వప్నము, సుషుప్తి, తురీయము. ఇవియే ఆత్మకు నాలుగు భాగములని నిరూపిస్తూ వచ్చింది. జాగ్రదవస్థ అనగా మేలుకొని వుండుట. ఈ స్థితిలో ఆత్మ బహిర్ముఖమై వుంటుంది.

330128602

కన్నులు రంగులు చూడగలుగు తుంటాయి. చెవులు మంచి చెడ్డల శబ్దము వినగలుగు తూ వుంటాయి నాలుక రుచులను చూడగలుగు తా వుంటుంది. నాసిక సుగంధములను అనుభవిస్తూ వుంటుంది ఈ విధముగా పంచభూతముల యొక్క ప్రభావము నిత్యజీవితము లోపల బహిర్ముఖమై తమ తమ కర్తవ్యములను నిర్వర్తిస్తూ వుంటున్నాయి. ఈ ఆత్మ వ్యక్తిగతము కాక సమిష్టితో అనుభవిస్తూ వుంటుంది. అనగా యీ ఆత్మ విశ్వముతో సంబంధమై వుండటం చేత యీ జాగ్రదవస్థలో వుండిన బహిర్ముఖమైన ఆత్మకు విశ్వుడు అనేపేరు పెట్టారు. అనగా విశ్వస్వరూపమే ఆత్మ స్వరూపము. విశ్వమే విష్ణుస్వరూపమని. కనుకనే ఋషికేశవనం అనేటువంటిది మనం అత్యవసరంగా భావించాలి. దానిని భక్తి భావముతో హృషీకేశవనం భక్తిరుచ్యతే అని. కనుక జాగ్రదవస్థయందు ఆత్మ విశ్వవ్యాపకమైన రూపాన్ని ధరిస్తుంది.

రెండవది స్వప్నావస్థ. ఇది ఆత్మ అంతర్ముఖముగా వుంటుంది. నిద్రయందే కలలు కంటూ వుంటాడు. అయితే కర్మేంద్రియములు యీ స్వప్నావస్థయందు యేమాత్రము కూడను తమ తమ పనులు తాము చేయవు. అంతరింద్రియములు మాత్రమే యిందులో జాగ్రతగా వుంటాయి. ఇందులో కేవలము మనో బుద్ధులు మాత్రమే తమ తమ పనులను తాము చేస్తూ వుంటాయి. ఇది సమిష్టి స్వరూపమును విస్మరించి వ్యక్తి స్వరూపములో అతి జాగ్రతగా మెలగుతూ వుంటుంది. ఒక రూమునందు పదిమంది పవళించి వుండినప్పటికి ఎవరికల వారికే గాని ఒకరి కొకరికి యేమాత్రము సంబంధముండదు. కనుక స్వప్నావస్థయందు వ్యక్తిత్వమును మాత్రమే అనుభవిస్తుంది కాని సమిష్టిని యేమాత్రము అనుభవించుటకు వీలుండదు. ఈ స్వప్నావస్థయందు కేవలము తేజస్వరూపమై వుండటంచేత ఆత్మకు స్వప్నావస్థయందు తైజసుడు అని పిలుస్తూ వచ్చారు.

ఇంక సుషుప్తి. సు అనగా మంచి. సుప్తి అనగా నిద్ర. గాఢనిద్రకే సుషుప్తి అని పేరు. ఈ గాఢ నిద్రలో కేవలము సూక్ష్మేంద్రియములు యేమాత్రము పనిచేయవు. మనస్సు కూడను ఆత్మలో లయమై వుంటుంది. కనుక యీ యింద్రియముల యొక్క సంబంధము యేమాత్రము దీనికి వుండదు. కర్మేంద్రియములు గాని, జ్ఞానేంద్రియములు గాని దీనికి యేమాత్రము సంబంధము కలిగి వుండదు. కనుక యీ సుషుప్తి యొక్క స్థాయిలో ఆత్మప్రజ్ఞతో కూడి వుండటంచేత యిందులో యితనికి ప్రాజ్ఞుడని పేరు వచ్చింది.

ఇంక తురీయము. తురీయమనగా నాల్గవస్థానమని దీనికి అర్థము ఇందులో జీవుడు దైవముతో ఐక్యమై వుంటాడు. అందులో జీవత్వము ఐక్యానుసంధానమును అనుభవిస్తుంది. కాని దేహ బుద్ధితో చూచినప్పుడు యిది తమస్సుగా వుంటుంది. ఆత్మ బుద్ధితో చూచినప్పుడు యిది కేవలము తన్మయత్వముగా వుంటుంది. మొదటిది విశ్వుడు. రెండ

పది విస్మృతి. అనగా మనము దేహబుద్ధితో చూచినప్పుడు యిది కేవలము ఒక తమస్సుగానే కూపాడుతుండి. కానీ తురీయస్థితిని మనము ఆత్మబుద్ధితో చూడాలి. అప్పుడే దీని యొక్క ఉన్నయస్థితిని మనము అనుభవించుటకు వీలవుతుండి. ఇట్టి తురీయస్థితినే సమాధి అనిపిలుస్తూ వచ్చారు. ఇదియే మానవుని పరమా పధి. ఈ జాగ్రత్, స్వప్న, సుషుప్తి, తురీయావస్థలు ఆత్మకు నాల్గు పాదములవంటివి.

అదే విధముగనే ఓంకారమునకు నాల్గు పాదములున్నవి. అకార, ఉకార, మకార, అ మాత్రలు అనేవి నాలుగు. ఈ అమాత్రస్థితియే తురీయస్థితి అనికూడను భావిస్తూ వచ్చారు. ఈ అకారమైనది వాఙ్మయమై జగత్తంతా వ్యాపించినటువంటిది. కనుకనే యిది విశ్వస్థాయికి చేరినది. కనుకనే దీనికి విశ్వుడు అని చెప్పవచ్చును. కారణమేమనగా యిది శబ్ద బ్రహ్మముతో కూడినది. ఉకారమనేది ఉచ్ఛరణ. ఇది దివ్యత్వమైన తేజస్సుతో కూడినది. ఇక మకారము ఓంకారములో కడపటిపదము. ఇది ప్రజ్ఞతో కూడినది. అకారము, ఉకారము, మకారము మూడింటి యొక్క చేరికనే అమాత్రస్థితి అని పేరు పెట్టారు. దీనినే ఓంకారము అన్నారు. ఈ నాలుగు కూడను ఓంకారమునకు నాల్గు పాదములు.

కనుకనే మానవత్వమందు చక్కగా విచారించినప్పుడు ఆత్మ అంటే ఏమిటి? ఆత్మ అనగా వాక్కు, శరీరము, ప్రాణము మూడింటి యొక్క ఏకత్వమే ఆత్మ. ఈ మూడింటి యొక్క చేరికనే ఆత్మ. ఇందులో మనస్తత్వము దేహముతో కూడి వుంటుంది. ఈ వాక్కు తేజోమయమైనదిగా వుంటుంది. ఈ మనస్సు అన్నమయమైనదిగా వుంటుంది. ఇంక ప్రాణము రసమయమైనదిగా వుంటుంది. తేజోమయమైన వాక్కు అన్నమయమైన శరీరమునకు రసమయమైన తేజస్సులో అనగా వాక్కునందు చేరిపోతూ వుంటుంది. బ్రహ్మమునందు చేరిపోతూ వుంటుంది. అనగా తేజోమయమైన వాక్కు అన్నమయమైన దేహములో, ప్రాణమయమైన రసముతో కూడివుంటుంది. దీనినే అష్టైశ్వర సంపన్నముగా యీ బ్రహ్మతత్వాన్ని వర్ణిస్తూ వచ్చాయి ఉపనిషత్తులు.

శబ్ద బ్రహ్మమయీ చరాచరమయీ జ్యోతిర్మయీ వాఙ్మయీ
నిత్యానందమయీ పరాత్పరమయీ మాయామయీ శ్రీమయీ
అష్టైశ్వర్యమయీ సదాశివమయీ శ్రీశివశక్తి సాయీమయీ.

ఈ ప్రపంచమునందు బ్రహ్మకాని పదార్థము ఒక్కటి కూడను లేదు. ప్రపంచమంతయు కూడను బ్రహ్మమయమే. కనుకనే ఆత్మతత్వమనగా కేవలము యిందులో ఓంకారమనియు, బ్రహ్మమనియు, విశ్వవ్యాపకమైన తత్వమనియు మనము విశ్వసించవలసి వస్తుంది.

వాకే ఋగ్వేదమనియు, మనస్సే యజుర్వేదమనియు, ప్రాణమే

330128604

సామ వేదమనియు చెబుతూవచ్చారు. కనుక వేదసారమంతయు మానవాకారమునందే లీనమై వున్నది. ఆత్మకాని పదార్థము జగత్తునందు కానరాదు. శాశ్వతము, నిత్యము, సత్యమైన అస్తి భాతి ప్రియ స్వరూపమే ప్రతీ పదార్థము. వీటినే సత్ చిత్ ఆనందమని కూడను సంస్కృతమునందు చెప్పబడుతూ వచ్చింది. Being, awareness and bliss. ఈ తత్వమునందు మనము ఆత్మతత్వమును వెతక నక్కరలేదు. కేవలము రూపనామములు కల్పితమైనప్పటికి ఆకల్పితమైన రూపనామములు ఆశ్రయించియే మానవుడు ఆత్మను విస్మరిస్తున్నాడు. ఇట్టి ఆత్మతత్వమును విద్యలచేతగాని, మరేవిధమైన సాధనలచేతగాని గుర్తించుటకు సాధ్యము కాదు.

అరువది నాలుగు విద్యలు అరుదారుగ నేర్చినట్టి ఆనారదుడే
నిరవధిక శాంతి కనుగొని పరమానందము నాడు పొందడుగాదె.

నారదుడు నేర్వని విద్యలు లేవు. అలాంటి నారదునకు మధ్యమధ్య అశాంతి ప్రవేశించి అనేక విధములుగా అతనిని బాధిస్తూ వచ్చింది. చదువునకు సంస్కారమునకు చాలా వ్యత్యాసమున్నది. గ్రంథ పరిచయము కేవలము జగత్తునకు మాత్రమే వినియోగపడగలదు. పుస్తకములంతా కూడను మస్తకముగా మార్చుకోవచ్చును కానీ మస్తకాన్ని ప్రాక్టికల్ లో, అనుభూతిలోకి తెప్పించుకోవాలి. కనుకనే యీ సందేహ నివారణార్థమై తాను ఒక ఋషి దగ్గరకు వెళ్లాడు అక్కడ ఆ ఋషి యితనిని ప్రశ్నించాడు. అయ్యా నీయొక్క విద్యల రుజువేమిటి, నీ క్వాలిఫికేషన్ యేమిటో చెప్పమని చెప్పాడు. ఆగురువే సనత్కుమారుడు. ఈ సనత్కుమారుడు ప్రశ్నించిన ప్రశ్నకు నారదుడు తన విద్యల ప్రఖ్యాతను ప్రదర్శిస్తూ వచ్చాడు. విన్నంత వరకు విన్నాడు సనత్కుమారుడు. కడపటికి పెదవి విరిచాడు. ఇంతేనా నీ విద్యల సారము అని. అతడు విన్నంత వరకు నారదుని యొక్క గర్వము మితిమీరిపోతూ వచ్చింది. ఆహా! నా విద్యల యొక్క ప్రావీణ్యతను సనత్కుమారుడైన మహా గురువు వింటున్నాడు కదా అని ఆనందించాడు. అంతా నారదుడు ముగించిన తరువాత సనత్కుమారుడు ప్రశ్నిస్తున్నాడు. నీ విద్యలన్నీ నామ మాత్రములే అన్నాడు. మహర్షి నామమునకు మించినది యీజగత్తునందు కలదా అని ప్రశ్నించాడు నారదుడు. పిచ్చివాడా నామమే ప్రధానమని భావిస్తున్నావు, భ్రమిస్తున్నావు కాదు నామముకంటె గొప్పది వాక్కు అన్నాడు. వాక్కుకంటె గొప్పది మనస్సు, మనస్సు కంటె గొప్పది సంకల్పము. సంకల్పము కంటె గొప్పది చిత్తము. చిత్తముకంటె గొప్పది బలము. ఈ బలము కంటె గొప్పది పృథ్వి. ఈ పృథ్వికంటె గొప్పది అన్నము. అన్నము కంటె గొప్పది జలము జలము కంటె గొప్పది తేజస్సు. తేజస్సుకంటె గొప్పది ఆకాశము. ఆకాశముకంటె గొప్పది స్మృతి ఈ స్మృతి కంటె గొప్పది ప్రాణము. ప్రాణమే తల్లి. ప్రాణమే తండ్రి. ప్రాణమే గురువు. ప్రాణమే బంధువు. సర్వము ప్రాణమయమే. ఈ ప్రాణమే రసస్వరూపము. సర్వరసములసారము. దీనినే ఉపనిష

త్తులందు రసోవైసః కనుక దీనియొక్క నామ మాత్రము యీరసము ముందు యే మాత్రము అన్నాడు. కనుక యీ ప్రపంచమంతయు కూడను నామమాత్రముతో కూడినది. నామమునకు ఒక రూపము ఈ రూపనామములు రెండును కల్పితములే. ఈ కల్పితములను ఖండించినప్పుడు శాశ్వతము మనకు తెలిపోతుంది. కనుక యీ రూపనామములతో కూడిన జగత్తు కూడను అస్తి భాతి ప్రియం. అనగా సత్ చిత్ ఆనందములతో కూడినదే. కనుక ఓంకారము లేని జగత్తుగాని, వస్తువుగాని, బ్రహ్మము లేని వస్తువుగాని, పదార్థము గాని, ఆత్మ లేని వస్తువుగాని, పదార్థముగాని యీ జగత్తు నందు కానరాదు.

కనుక మన తత్వమును మనము గుర్తించటానికి తగిన ప్రయత్నము చేయటమే సాధన. తనవునికిని తానుగుర్తించి వర్తించటమే మానవుని ప్రధానమైన కర్తవ్యము. కనుపించుచున్నవన్నీ కూడను మిథ్యములే. దీన్ని ఆధారము చేసుకున్నదే సత్యము. ఈ మిథ్యమునందు కూడను సత్యమున్నది. సత్యమునందు కూడను మిథ్యము లేనట్టి వున్నది. కాని సత్యమునందు మిథ్యము, మిథ్యమునందు సత్యము మాత్రమే విచారించటము కాదు మన యొక్క ప్రధాన కర్తవ్యము, గమ్యము. సత్యమునుండి సత్యమును గుర్తించాలి. ఇదే ప్రధానమైన సాధన. ఈ సాధనకు సర్వత్ర దైవత్వమును మనము విశ్వసించాలి. ప్రతి మానవునియందు నివశించునది, ప్రకాశించునది, ప్రకటించునది ఒక్కటే అదే భగవత్ తత్వము. కనుక అనేకత్వములోని యేకత్వమును మనము గుర్తించటానికి తగిన ప్రయత్నం చేయాలి. కనుక ఆత్మ అనగా ప్రత్యేకమైన ఒక ప్రదేశమునందు మనము గుర్తించటానికి వీలుకాదు. సర్వత్రా నిండినది. అనగా వాక్కు, మనస్సు ప్రాణము యొక్క చేరికనే. మనస్సు కేవలము అన్నమయమైనది. మనము ఎట్టి ఆహారమును భుజింతుమో మనస్సు అట్టి తలంపులతో కూడివుంటాది. కనుక మనస్సు అన్నమయమైనది. కనుక యీ అన్నమయమైన మనస్తత్వాన్ని వాక్ మయమైన దానితో సంబంధ బాంధవ్యమును కలిపి, తద్వారా ప్రాణమయముతో యేకము చేసినప్పుడు ఆత్మ స్వరూపాన్ని దర్శించగలము. అనగా మూడింటియొక్క యేకత్వమే యీ ఆత్మస్వరూపము. GOD యీ మూడు అక్షరములు చేర్చినప్పుడు మనము యేవిధముగా GOD అనుకుంటున్నామో అదేవిధముగానే వాక్ + మనసు + ప్రాణము = ఆత్మ అని. ప్రపంచమంతయు కూడినది matter. కనుక యీ matter matter గానే మనము వుంచకూడదు. దానికి నిత్యమైన సత్యమైన తత్వాన్ని చేర్చాలి. జగత్తు అనగా యేమిటి? Matter + Being = Nature ప్రపంచమనగా ప్రత్యేకముగా లేదు. ఈ ప్రపంచము లోపల మేటర్ తో పదార్థములతో ఆత్మ కూడి వుంటున్నాది. ఈ సత్ అనేది లేకుండా యీ అనిత్యమైన ప్రకృతి మనకు కానరాదు. మార్పు చెందునటువంటి పదార్థముతో మార్పు చెందనటువంటి దైవత్వము చేరి

330128606

వుంటున్నది. దీనినే యీనాటి సైంటిస్టులంతా కూడను matter and energy అన్నారు. energy అనగా శక్తి అని. ప్రతి పదార్థము నందు దానికి సంబంధించిన శక్తి వుంటున్నది. కనుక energy లేని matter లేదు. అదేవిధముగనే ఆత్మలేని స్థానము, ఆత్మలేని రూపము, ఆత్మలేని పదార్థము జగత్తునందు లేదు. కనుక యిట్టి అనంతత్త్వమైన ఆత్మతత్త్వాన్ని గుర్తించినప్పుడే సర్వము మనకు అర్థమవుతుంది.

అంతా ఒక్కటే. నీవు వేరు నేను వేరు కాదు. దేహములు వేరుగా వుండవచ్చును. పేర్లు వేరుగా వుండవచ్చును. కాని అందులో వుండిన దివ్యశక్తి ఒక్కటే. ఇక్కడ పెద్ద లైటు వుంటున్నది. కాని అక్కడ చీకటిలో వెలుగుతూ వుంటున్నది లైటు. ఇక్కడ చిన్న చిన్న బల్బులు అంతా వెలుగుతున్నాయి. అక్కడ పెద్దపెద్ద tube lights వెలుగుతున్నాయి ఆ tube యొక్క రూపము, ఆ tube యొక్క నామము ప్రత్యేకముగా వుంది. ఈ దీపము యొక్క రూపము నామము వేరుగా వుంటున్నది. ఆ దీపమునకు రూపము నామము వేరుగా వుంటున్నది. కాని అన్నింటి యందు కరెంటు ఒక్కటే. అదేవిధముగనే మానవుని యొక్క ఆకార రూపములు ప్రత్యేకముగా వుండవచ్చును. భిన్న భిన్నముగా వుండవచ్చును. కాని అందరి యందు దైవత్వమనే ఆత్మతత్త్వము ఒక్కటిగానే వుంటుంటాది. బల్బుల లోపల colours ప్రత్యేకముగా వుండవచ్చును. voltage ప్రత్యేకముగా వుండవచ్చును. ఇంత మాత్రమున చేతనే మనము భేదములు పాటించరాదు. లోపల వున్న శక్తి తత్త్వము ఒక్కటే. అదే ఆత్మ అదే బ్రహ్మము. అదే ప్రజ్ఞానము. బ్రహ్మ వేరు ఆత్మ వేరు కాదు.

దీనికి మరొక ఉదాహరణము. ఉదయించే సూర్యుని యందు మూడు రంగులుంటున్నాయి. ఎఱుపు తెలుపు నలుపు. ఇది ఉదయించక పూర్వము నలుపుగా వుంటుంది అప్పుడు చీకటి అంటాము మనము. క్రమక్రమేణా ఉదయించే సమయము లోపల అది కాంచెమా ఎఱ్ఱని రంగుగా మారుతూ వస్తుంది. కాని అది పూర్తి ప్రకాశించినప్పుడు తెల్లని రూపము ధరిస్తుంది. అదేవిధముగా ఆత్మ ఒకస్థాయి యందున్నప్పుడు ఒక్కొక్క రూపాన్ని ధరిస్తూ వుంటుంది. జాగ్రతలో ఒక రూపమును, స్వప్నములో మరొక రూపమును, సుషుప్తిలో మరొక రూపమును ధరించినట్లుగా ఉదయించక పూర్వము, ఉదయించే సమయములో, పూర్తి ప్రకాశించే సమయములో యీ సూర్యుని రంగులు యే విధముగా మారుతాయో, సూర్యుడు ఒక్కడే ఏ విధముగా వుండగలడో అదేవిధముగా ఆత్మ ఒక్కటే అయి వుండినప్పటికిని వివిధ స్థాయిలందు, వివిధ కాలములందు, వివిధ స్థితులయందు యీ ఆత్మ యొక్క రూపములు ప్రత్యేకముగా మారుతుంటాయి. మనము సులభముగా అర్థము చేసుకోవలెనన్న పుట్టినప్పుడు చిన్న బిడ్డ child. పది సంవత్సరములయ్యేటప్పటికి వానిని boy అంటున్నాము.

330128607

వాడే 30 years, 35 years వచ్చేటప్పటికి man అంటున్నాము. కానీ అతనే 75 years 80 years వచ్చినప్పుడు grand father అంటున్నాము. వ్యక్తి ఒక్కడే అయినప్పటికిని అవస్థల చేత, రూపనామముల చేత అనేకమైన మార్పులు కలుగుతున్నాయి. ఇదే జాగ్రత్, స్వప్న, సుషుప్తి తూరీయా వస్థలు. ఈ మూడు రకములైన తత్వములు మననేత్రములందే కనుపిస్తున్నాయి.

వాక్కు, మనస్సు, ప్రాణము. వాక్కు తేజోవంతముగా వుంటుంటాది. మనస్సు అన్నమయమైనది కనుక నల్లనిరంగుగా వుంటుంది. వాక్కు ఎఱ్ఱని రంగుగా వుంటుంది. ప్రాణము తెల్లనిరంగుగా వుంటుంది. అదే మన కన్నులందు కొస భాగమునందు ఎఱ్ఱని రంగుగా వుంటుంది. మధ్యలో వుండిన గ్రుడ్డు నల్లని రంగుగా వుంటుంది. దానికి చుట్టూ వుండినది తెల్లని రంగుగా వుంటుంది. కనుకనే యీ మూడింటి యొక్క ఆకారములు మన నేత్రమునందే మనము చూడ కలుగుతున్నాము. మన దృష్టియందే తానుండి మనకన్నీ చూపుతూ వుంటున్నాడు పరమాత్ముడు. అందులోనే మన ప్రతిబింబమును మనము చూడగలుగుతూ వుంటున్నాము. కనుకనే ప్రతిబింబమనే జీవతత్వము బింబమనే నేత్రత్వమునందు మనము ఏకత్వము గావించినప్పుడు అదే ఆత్మతత్వము. ఆత్మతత్వమనగా యొక్కడో మనము విచారించనక్కరలేదు. పెద్దపెద్దగ్రంథములు మనము చదువనక్కరలేదు. ఆత్మనే తేకుండిన మనమే తేము అనే విశ్వాసమును మనము దృఢపరచుకోవాలి.

దీనినే మనము అప్పుడప్పుడు చెప్పుకుంటున్నాము. The one you think you are. బాహ్యదృష్టిచే, బహిర్ముఖమైన జాగ్రత దృష్టిచే నీవు చూడటం చేత The one you think you are. మనము కొంత అంతర్ముఖము లో దృష్టిని ప్రవేశపెట్టినప్పుడు. The one others think you are. ఈ రెండిటిని విస్మరించి మనయొక్క దృష్టిని కొంతవరకు మరింత లోతునకు పంపించినప్పుడు The one you really are అదే ఆత్మదృష్టి నీవు దేహాన్ని చూడవద్దు. మనస్సును చూడవద్దు. నీయొక్క ఆత్మను చూడు. నీయందున్న ఆత్మనే అందరియందు వుంటున్నది. సర్వత్ర యీ ఆత్మతత్వాన్ని గుర్తించకుంటే యింక యీ రాగద్వేషములకు యే మాత్రము అవకాశము వుండదు. అప్పుడే మనము ఆశించిన సత్యవాక్కు, ధర్మప్రవర్తన, శాంతి చిత్తము, ప్రేమతత్వము యీ నాల్గింటి యేకత్వము చేత అన్నివిధముల ప్రశాంతి మనకు యేర్పడుతుంది. అదే అహింస. కనుక మొట్టమొదట మనము యీ సత్యాన్ని గుర్తించినప్పుడు యితరులకు చెప్పుటకు కూడను సాధ్యమవుతుంది.

ఇందులో ప్రవేశించిన అధ్యాపకులు ముప్పై దేశములనుంచి వచ్చారు. ఫ్రాన్సు, ఆస్ట్రేలియా, నేపాల్, రష్యా, సౌత్ ఆఫ్రికా వీరిలో కొన్ని విధములైన సందేహాల లోపల స్వామిని యీ సందేహ నివారణార్థమై చీటీ వ్రాసి పంపించారు. మా రష్యాలోపల యీవిధమై

330128608

న ప్రచార ప్రబోధలు సల్పుటకు కొంచెము కష్టమవుతుందని. యింక ఆస్ట్రేలియా లోపల అనేక కర క్షేమమైన అలజడులతో కూడి వుండటం చేత అక్కడ కూడను యీ మానవతా విలువలు యే విధముగా మేము అభివృద్ధి గావించాలి అని వారిలో కొన్ని సందేహములు వచ్చాయి. నా వుద్దేశ్యమేమనగా రష్యా, చైనా, ఆస్ట్రేలియా, జర్మనీ, జపాన్, ఇటలీ ఏదేశమైనప్పటికిని అందరూ మానవ జాతికి చెందినవారే. కనుక ప్రతివ్యక్తి కూడను యీ మానవత్వం గుర్తించుటము అత్యవసరము. అయితే బాహ్యప్రపంచమునందు కొన్ని విధములైన అడ్డు తగులుతూ వుంటాయి. ఇప్పుడు ఆస్ట్రేలియా తీసుకోండి. ఈ ఆస్ట్రేలియా లోపల యింగ్లీషు భాషగాని అనగా చరిత్రగాని, భూగోళ శాస్త్రముగాని వీటిలో విషయములు కేవలము వుద్రేకముతో కూడి వుంటాయి. టెక్స్టుబుక్‌లంతా కూడను. సరిగా చెప్పాలంటే Violence తో కూడి వుంటాయి. వారు చదువులలో ఆవిధముగా వుంటున్నప్పుడు మనము యీ ప్రశాంతమైన వాతావరణమును అందులో ప్రవేశపెట్టుటము ప్రప్రధములో కొంచెం కష్టతరముగా వుంటుంది. వారి హృదయాలంతా కేవలము క్రోధముగానూ, ఒక విధమైన అలజడిగానూ వుంటూ వుంటాయి. ప్రతి దానికి వుద్రేకము ఎక్కువగా వుంటూంటాది.

కనుక యీ సమయములోపల మనము యీ మానవతా విలువలు ప్రభుత్వముతో యే మాత్రము సంబంధము లేకుండా మనము భక్తులు మాత్రమే బాలవికాస్ నందు లేక భక్తుల సమూహమునందు యీ మానవతా విలువలు క్రమక్రమేణా అభివృద్ధి గావించుకుంటూ రావటం మంచిది. కనుక మొట్టమొదట మనము రష్యాలో, సౌత్ ఆఫ్రికాలో, ఫ్రాన్సులో ఆస్ట్రేలియాలో ప్రభుత్వముతో యిప్పుడు సంబంధము పెట్టుకొనకుండా ప్రత్యేకముగా మన సంస్థలతోనే యీ సంబంధ బాంధవ్యములను అభివృద్ధి పరచుకొని బాలవికాస్ start చేసి తద్వారా దీనిని వ్యాపింపచేసుకోటం అత్యవసరము. అది చాలా మంచిది. క్రమక్రమేణా వారే దీని యొక్క సత్యాన్ని గుర్తించి వారే దీనిని ఆశిస్తూ వస్తారు. Sathya Sai Education in Human Values అంటే యిది భారత దేశములో ప్రత్యేకముగా ప్రారంభించిన సంస్థ యేమో అనుకుంటారు. కనుక వారు క్రమక్రమేణా దీనిని అర్థము చేసుకొనే వరకు కూడను దీనిని మన సంస్థల ద్వారానే కొంతవరకు అభివృద్ధి గావించుకోటం వుత్తమం. నేపాల్ నుంచి వచ్చిన టీచర్సు అందరికి నేపాల్ ప్రభుత్వము యీ విధమైన Human Values కు తగిన అవకాశము యిస్తుందో యివ్వదో అనే అనుమానాస్పదముతో వారు స్వామిని ప్రశ్నిస్తూ వచ్చారు. ఇంక కొంతమంది చిన్న చిన్న పిల్లలకు ఏవిధముగా బోధించాలి. వారికి సరైన సత్యము, శాంతి, ప్రేమ, అహింస యీ భావములు వారికి ఏవిధమైన మార్గములో మేము అందించాలి అని సందేహముతో వ్రాస్తూ వచ్చారు.

ముఖ్యముగా అధ్యాపకులు యీ సత్యమును తమ ఆచరణలో పెట్ట

టానికి మొట్టమొదట ప్రయత్నించాలి. చూచినది చూచినట్లుగా, విన్నది విన్నట్లుగా, చెప్పినది చెప్పినట్లుగా, చేసినది చేసినట్లుగా చెప్పటం సత్యము అని యీప్రాకృతమైన జగత్తునందు దీని విశ్వసిస్తూ వుంటారు. కానీయిది కొంత ప్రమాదమునకు గురౌతుంది. దీనినే అనేకవిధములుగా భగవద్గీతయందు కూడను గీతాచార్యుడు చెప్పాడు. అనుద్వేగకరం వాక్యం సత్యంప్రియ హితం చైవ. సత్యమైనప్పటికిని అది ప్రియగాను, హితముగాను, సత్యం సత్యమని అది యితరులకు బాధ కలిగించేదిగాను, అప్రీతి కలిగించేది మనం చెప్పకూడదు. దీనినే సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ నబ్రూయాత్ సత్యమప్రియమ్ అని. ఒక చిన్న ఉదాహరణ వుంటుండాది. ఒకరు చక్కగా నడవ లేని పరిస్థితిలో వుంటుంటాడు కాలు పోలియోనో యేదో కొంచెం వచ్చి విక్తితో వుంటాది. సరిగా నడచలేడు. యిది సత్యమే. కాలు లేనిది సత్యమే అని, నడచటం చేత కాదని సత్యమని, ఓ కుంటి వాడారా అంటే వారికి యెంత బాధ కలుగుతుంది. కనుక యీ సమయము లోపల సత్యమైనప్పటికిని అతని పేరు పెట్టి మనం పిలుస్తాము. oh brother Come on అని పిలుస్తాం. యీ రకముగా మనము పిలువవచ్చుగాని, యిది సత్యమని ఓ కుంటివాడా రా, ఓ గుడ్డివాడా రా! అంటే వారికి చాలా బాధ కలుగుతుంది. ఇది సత్యమైనప్పటికిని దీనిని యీ రకముగా మనము వుపయోగించరాదు. వారికి ప్రియముకదా అని వానిని అసత్యముతో వర్ణించి పైకి ఎత్తరాదు. ఈ సత్యాసత్యములకు రెండింటికి కొంచెం సందిగ్ధావస్థ కలిగినప్పుడు నీవు కొంతవరకు silentగా వుండటం మంచిది. కనుక పిల్లలయందు యీ సత్యము వారికి ఏ విధముగా బోధించాలంటే నాయనా సత్యమనేది భగవత్ స్వరూపము. ఎలాంటి పరిస్థితులయందు యితరులకు బాధించక వున్నది వుండినట్లుగా నీవు చెప్పటంలో కూడను కొంచెం ముందు వెనుక యోచన చేసుకొని వుపయోగ పెట్టుకోవాలని చెప్పాలి. సత్యము ప్రారంభములో కొంతవరకు కష్టము కలిగిస్తుంది. కానీ క్రమక్రమేణా అది మనకు సహజమై పోతుంది. సత్యము నిజంగా సత్యాన్ని విచారిస్తే యిది మూడు కాలములకు అతీతమైనది. ఇప్పుడు మనము చెప్పేది మనము సత్యముగా భావిస్తున్నాము. కాదు కాదు యిది నిజమని చెప్పవచ్చు. ఇప్పుడు నేను చూచినప్పుడు ఆవ్యక్తి ఒక టోపి వేసుకున్నాడు, స్వెట్టరు ధరించాడు. నేను చూచినప్పుడు టోపి పెట్టాడు స్వెట్టరం వేసుకున్నాడు. కానీ రేపటి దినము అతడు టోపి తీసి వేయవచ్చు చలి లేదని స్వెట్టరు తీసి వేయవచ్చు. కాదు కాదు అతను టోపి ధరించి స్వెట్టరు వేసుకున్నవాడు నేను చూచాను అంటే అది సత్యము కాదు అది నిజము. తాత్కాలికముగా నీవు చూచినప్పుడు ఏ ప్రస్థలో వున్నాడో దానిని నిజమంటారు. సత్యమంటే అది కాదు. భూత భవిష్యద్ వర్తమాన కాలములందు ఒకే రూపాన్ని ధరించినది సత్యము. సత్యము నురెండు రకములుగా మనము జగత్తులో అనుభవిస్తున్నాము. దేహ బుద్ధితో అనుభవించే సత్యము ప్రాపంచిక సత్యము. ఆత్మబుద్ధి

తో అనుభవించే సత్యము దైవ స్వరూపము. కనుక యీ పిల్లలకు యిప్పుడు మొట్టమొదట యీదేహ బుద్ధితో సంబంధమైన సత్యమును మనము బోధిస్తూరావాలి.

ఇంక South Africa లోపల యీ education in Human Values అనేదానికి కొన్ని పరిస్థితుల వల్ల యిప్పుడు వాతావరణము కొంచెం విరుద్ధముగా వుంటున్నది కనుక మనము యిప్పట్లో యీ South Africa లోపల క్రమక్రమేణా ప్రభుత్వము తో సంబంధము లేకుండా మన భక్తులకు బాలవికాస్ కు సంబంధించిన దానిని మనము అభివృద్ధి గావించుకోటం మంచిది. కొంతమంది అధ్యాపకులు యీ బాల బాలికలను యే వయస్సు వరకు Coeducation చేర్చి పాఠములు చెప్పటం మంచిది అని ప్రశ్నించారు. ఈ Coeducation అనేది మన Sathya Sai Balavikas నందుగాని Human Values లోగానీ నా వుద్దేశ్యము 5 మొదలుకొని 12 లేక 14 సంవత్సరములకు మాత్రమే వారిరువురిని చేర్చి బోధించటం మంచిది. అందున యీ బాలవికాస్ టీచర్సు చాలావరకు స్త్రీలు అధికముగా వుండటంచేత యీ పెరిగే పిల్లల పరిస్థితులను స్త్రీలు అరికట్టటానికి సాధ్యము కాదు. కనుక 12 లేక 14 సంవత్సరములు దాటిన తరువాత మగపిల్లలు వేరు, ఆడపిల్లలు వేరు చేసి మగపిల్లలకు మగవారు ఆడపిల్లలకు ఆడవారు బోధించటం మంచిది. ఆడపిల్లలకు కూడను మగ అధ్యాపకులు బోధించటానికి అవకాశము వుంటుంటాది. కారణమేమనగా పెరిగే మగపిల్లలు ఆడవారి మాటలను లక్ష్యము చేయరు. వారంటే కొంత భయము కూడా వుండదు. కనుక యీ వినయ భయ విశ్వాసముల తో, భయము కూడను అవసరమే, కనుక యిది మగ అధ్యాపకుల దగ్గరనే యీ పిల్లలను పెట్టి కొంతవరకు వీరికి అభ్యసింపచేయటం మంచిది.

ముఖ్యముగా అధికముగా సందేహపడే విషయములలో ఒకటి వున్నది. అది ఏమిటనగా మేము యే విధముగా బోధించాలి. ఇంకా కొంతమంది ప్రశ్నవేశారు. కొంతమంది అంగవిహీనులుగా వుంటారు. తెలివితక్కువ పిల్లలుగా వుంటారు. ఇలాంటి పిల్లలకు మేము యే విధముగా బోధించాలి అని ప్రశ్నిస్తూ వచ్చారు. తెలివి తక్కువ పిల్లలకు మనము యే రీతిగా బోధించాలనే ప్రశ్న వేయుటము వారికే తెలివితక్కువ అని నా వుద్దేశ్యము. మన education in human value తెలివి కలిగినవారే అర్థము చేసుకోలేక పోయినప్పుడు తెలివిలేని వారికి మనము బోధించి ప్రయోజనమేమిటి? కనుక మొట్టమొదట యీ తెలివితేటలు కల్గిన వ్యక్తుల లోపల తగిన భద్రతను మనము అభివృద్ధి పరచుకొందాము. తెలివితేటలు లేని బిడ్డలకు చక్కగా వారికి ప్రోత్సాహకరముగా చిన్న చిన్న కథలుగాను భగవత్ చరిత్రలను వారికి బోధించటానికి ప్రయత్నించాలి. ఈ అంగహీనులైన బిడ్డలను, తెలివితక్కువ బిడ్డలను వారి యీ అంగహీనులైన స్థితిని మరచిపోయేలా కథలు వారికి బోధించాలి. నాయనా! నీ అంగవిహీనత

కు నీవు యేమాత్రము యోచించనక్కరలేదు. దైవసృష్టిలో యిది కూడను ఒక కారణానిమిత్తమై ఏర్పడినదని చక్కగా వారికి వుత్సాహప్రోత్సాహమును అందించే చిన్నచిన్న కథలుగా వారికి చెప్పి వారికి భగవద్విశ్వాసము అభివృద్ధిపరచటానికి తగిన కృషి చెయ్యాలి. భారతీయుల చరిత్రలయందు సాధుసంతులలో అనేక రకములైన ఆదర్శవంతమైన జీవితాల్ని అనుభవించుతూ వచ్చారు. భగవంతుని ప్రేమించి, అనేకవిధములుగా అతనిని ప్రార్థించి తనను పొందే నిమిత్తమై అనేక సాధనలు సల్పినవాడు సూరదాస్. ఒకానొక సమయములో కృష్ణుడు ప్రత్యక్షమై సూరదాసూ నన్ను చూడాలనుకుంటున్నావా, నీకన్నులు లేవు కన్నులిచ్చేదా అని ప్రశ్నించాడు. కృష్ణా యింకా నన్ను మాయలో ముంచుతున్నావా, యీ చర్మచక్షువులతో చూచే చూపు చూపునా కాదు. అంతర్ముఖమైన జ్ఞాన చక్షువు నాకు ప్రసాదించమని కోరాడు. కన్నులున్నవారు ఎన్నికోట్లమంది లేరు. వారు నిన్ను చూస్తున్నారా? ఈ ప్రపంచములో శ్రోత్రములున్నవారు యెన్నికోట్లమంది లేరు. వారు అందరు నీ మురళీగానమును వింటున్నారా? ఈ విధముగా అడుగుతూ వచ్చారు కృష్ణుని సూరదాస్.

కన్నులుండి గ్రుడ్డులై కళ్యాణాకరమైన
నీమూర్తి దర్శింపనేరరైరి.
చెవులుండి చెవిటులై అతిమనోహరమైన
నీగానమాలింపనేరరైరి.

సర్వస్వము నీవై వుండగా నేను కోరెడి యేమిటి? నాకు యీ నేత్రములు అక్కరలేదు. నిరంతరము నీ సత్య నిత్యమైన తత్వమును, నీ హృదయమును, నీ ప్రేమను, నీ యొక్క ఆనందాన్ని అనుభవించే నేత్రాన్ని నాకు అందించమన్నాడు. కనుక యీ నేత్రములు లేని పిల్లలకు మనము యీ విధముగా బోధిస్తూ రావాలి. నాయనా వున్నారు ఎంతో మంది. కోట్లకు మంది వుంటున్నారు. నేత్రములు కలిగినవారు. వాళ్ళ వల్ల యేమి జరుగుతుందాది. కాదు కాదు నీవు అంతర్దృష్టిని అభివృద్ధిపరచుకో. దైవత్వమును దర్శించటానికి ప్రయత్నించు అని వుత్సాహప్రోత్సాహములు ఆపిల్లలకు అందిస్తూ రావాలి. కనుక అధ్యాపకులు యేయే స్థాయిలలో, ఏ ఏ వ్యక్తికి ఏ ఏ పరిస్థితులయందు, ఏ విధముగా బోధించాలనే విషయము తప్పక వారి తెలివితేటలను కొంచెము వుపయోగపెట్టి దానిని గుర్తించి వర్తించటానికి ప్రయత్నించాలి.

నిజముగా యీనాటి పరిస్థితిలోపల Education in Human Values యీ మానవతా విలువలు చాలా అవసరమైనవి. మానవుని ఆకారము కనుపించుచున్నది గాని మానవత్వము యిందులో యేమాత్రము కనుపించుటలేదు. ఈనాడు ప్రారంభించిన Education in human values అనేది ప్రాణసమానము ప్రపంచానికి. ఎడారిలో దాహముతో తపించే వ్యక్తికి చల్లని పానీయము చిక్కినప్పుడు యెంత ఆనందమును అనుభవించునో అదే విధముగనే యీనాడు ప్రపంచ

33D128612

ము లోపల శాంతి భద్రతలు లేక, మానవత్వము నిర్మూలమైపోయి కేవలము దానవత్వముగా ప్రవర్తించే ఈ సమయమునందు ఈ మానవతా విలువలు అత్యవసరముగా అందించాలి. కనుక ఈ workshop training అంతా అయిన తరువాత మీ మీ దేశములకు వెళ్ళి దీని యొక్క విశిష్టతను, దీని యొక్క పవిత్రతను, దీని యొక్క అవసరాన్ని అనేక మందికి మీరు అందిచ్చి, వారిని ఈ మార్గము లో ప్రవేశపెట్టుటానికి ప్రయత్నం చేయాలి. ఇదే నిజమైన సేవ. ఇదే నిజమైన భగవత్ తత్త్వము తనను తాను తరింప చేసుకోటం గొప్పతనము కాదు. తోటి మానవుని తరింప చేయటానికి తగిన ప్రయత్నం చేయటమే నిజమైన నిష్కామ కర్మ. క్రమక్రమేణా కాలేజీలో ప్రవేశపెట్టి ఈ కాలేజీ విద్యార్థి విద్యార్థినులకు కూడను ఈ విధమైన అవకాశము ఇవ్వటానికి కృషి చెయ్యండి. కనుక ఇవి అన్ని దేశాల వారికి కూడను ఒక్క ప్రశాంతి నిలయమునందు మాత్రమే దీనిని తరిబీదు చేయటం కష్టంగా వుంటుంది. మీ మీ దేశములనుంచి ప్రశాంతినిలయమునకు ఒక పర్యాయము రావాలంటే ముప్పై వేలు, నలభై వేలు ధన వ్యయమవుతుంది. కనుక నా ఉద్దేశ్యమేమనగా ఆయా దేశముల లోపలనే ఈ Education in Human Values conference అక్కడక్కడ పెట్టుకొని తద్వారా దీనిని అభివృద్ధిగావించటానికి తగిన కృషి చేయటం మంచిది. కనుక ఇక్కడనుండి పోయే ప్రతి అధ్యాపకుడు కూడను కొంతమంది అక్కడ చేరి మిగిలిన వారికి ఈ ప్రబోధలను అందించి తద్వారా వారిని ఉత్సాహప్రోత్సాహములనందించి కాన్ఫరెన్సులు ప్రారంభించటం అత్యవసరము. ఇంక మిగిలిన అంశములన్నీ ఆ కమిటీ వారు అనగా Education in Human Values కమిటీ వారు అనేక విధములుగా నిర్ణయించారు. దానిని తూచా పాటించి తద్వారా మీరు ఈ Human Values అనేదానిని దేశవ్యాప్తిగావించాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.